
సాక్షి ఒడిశా

మంగళవారం, 12, సెప్టెంబర్, 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,82,152లు, బంగారం 700 మిల్లీగ్రాములు, వెండి 71 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



త్వరలో రెండో వందే ఎక్స్‌ప్రెస్‌ సేవలు

రాష్ట్రంలో రెండో వందే భారత్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు సేవలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ట్రయల్‌ రన్‌ నిర్వహించారు. ఈనెల చివరి వారంలో ఈ రైలు నియమిత సేవలు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం.

- 8లో▸

స్పీకర్‌గా స్నేహాంగిని చురియా..?



రాష్ట్ర శాసనసభ కొత్త స్పీకర్‌గా స్నేహాంగిని చురియా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఈ మేరకు ఊహాగానాలు బలం పుంజుకుంటున్నాయి. ఈనెల 21న స్పీకర్‌ అభ్యర్థి ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన నామినేషన్‌ పత్రాలు దాఖలకు గడువు ముగుస్తుంది.

- 8లో▸

న్యూస్‌రీల్‌

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



నాటుసారాతో పోలీసులకు పట్టుబడిన నిందితుడు

జయపురం: జయపురం సమితి దామాగుడ నుంచి దొంగతనంగా ద్విచక్ర వాహనంపై జయపురంనకు నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు సదర్‌ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి సోమవారం వెల్లడించారు. పట్టుబడిన వ్యక్తి నుంచి 14 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సదర్‌ పోలీసులు పెట్రోలింగ్‌ జరుపుతున్న సమయంలో గొడాపాదర్‌ గ్రామానికి చెందిన గోవర్ధన్‌ హరిజన్‌ కుమారుడు భాస్కర హరిజన్‌ (29) బైక్‌పై వస్తుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతడు ఒక ట్యూబ్‌లో నాటుసారా తరలిస్తున్నట్లు గమనించి పట్టుకున్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

ఇండియా బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో చోటు



పెన్సిల్‌పై చెక్కిన సూక్ష్మమైన భారతదేశ మ్యాప్‌

బరంపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక బెజ్జిపూర్‌లోని నీలకంఠ నగర్‌ 3వ లైన్‌కి చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహరణ తన కళా నైపుణ్యంతో 0.5 మి.మీ పొడవైన సూక్ష్మ భారతదేశ మ్యాప్‌ను పెన్సిల్‌పై చెక్కాడు. దీంతో అతడు కళా నైపుణ్యంతో తయారు చేసిన భారత్‌ మ్యాప్‌కు ఇండియా బుక్‌ ఆఫ్‌ రికార్డులో సోమవారం చోటు దక్కింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మహరణకు పలువురు అభినందనలు తెలిపారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం



మాట్లాడుతున్న బిభుతి జెన్నా

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ విజయం తథ్యమని గంజాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిభుతి జెన్నా అన్నారు. స్థానిక గుసానినువాగం ఉత్తరేశ్వర్‌ కల్యాణ మండప ప్రాంగణంలో బీజేపీ నేతలతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. కేంద్రం నిధులతో పథకాలు అమలు చేస్తూ బిజూ పేరుపై పథకాలు ఇస్తున్నట్లు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అధికార బీజేడీ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజలు ఇప్పటికే గ్రహించారని పేర్కొన్నారు. గడిచిన 23 ఏళ్ల నవీన్‌ పాలనలో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, అందువలన రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని జోష్యం చెప్పారు. సమావేశంలో నగర అధ్యక్షుడు కన్నుచరణ్‌ పతి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు



అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: జాతీయ అటవీశాఖ అమరవీరుల దినోత్సవాన్ని స్థానిక జిల్లా అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్‌ఓ ఎస్‌.ఆనంద్‌ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మృతి చెందిన అటవీశాఖ అధికారులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అటవీశాఖ అసిస్టెంట్‌ కన్జర్వేటర్‌ అరుణ్‌కుమార్‌ సాహు, దేవగిరి రేంజ్‌ అధికారి ఎన్‌.డి.శర్మ, శివరాం సాబతో, సంతోష్‌కుమార్‌ పరిడా పాల్గొన్నారు.

బొమ్మలు చేసి.. ప్రాణం పోసి

- విగ్రహాల తయారీలో దిట్ట అమలాభట్ట
- మట్టినే నమ్ముకొని జీవనోపాధి
- వేర్వేరు రూపాల్లో గణనాథుల తయారీ



వివిధ రూపాల్లో గణనాథులు



విక్రయాలకు సిద్ధమవుతున్న విగ్రహాలు

రాయగడ:

పర్యావరణ హితంగా మట్టితో వినాయక విగ్రహాలను రూపొందిస్తూ తమకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని చాటుకుంటోంది అమలాభట్ట గ్రామం. జిల్లా కేంద్రానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఆ గ్రామం ఉంది. దాదాపు వంద కుటుంబాలకుపైగా నివసిస్తున్న ఈ గ్రామంలో అందరూ మట్టినే నమ్ముకొని జీవిస్తున్నారు. ప్రతిఏటా తీరైన విగ్రహాలను తయారు చేయడంతో పాటు సరసమైన ధరలకు విక్రయిస్తుండడంతో రాయగడ జిల్లాలోని బిసంకటక్‌, గుణుపూర్‌, చంద్రపూర్‌, మునిగుడ తదితర ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాకు చెందిన పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం వంటి ప్రాంతాల నుంచి వచ్చి విగ్రహాలను ఖరీదు చేస్తుండడం ఇక్కడి ప్రత్యేకత.

రెండు నెలల ముందుగానే...

సమీపంలోని నాగావళి నదిలో మట్టిని తీసుకొచ్చి వినాయక చవితికి రెండు నెలలకు ముందుగానే విగ్రహాల తయారీకి సన్నద్ధమవుతారు. మహిళలు, చిన్న పిల్లలు చిన్న విగ్రహాలకు రంగులు అద్దే పనిలో ఉంటారు. ఈ రెండు నెలలు కష్టపడితే మంచి ఆదాయం వస్తుంది. దీంతో ఇంటిల్లిపాది ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు. ఇదిలాఉండగా ఈ గ్రామంలో ఉన్నత విద్యను అభ్యసించే ఎంతోమంది యువకులు ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో చదువుతున్నా ఈ వినాయక చవితికి తయారు చేసే విగ్రహాల కోసం తమ తల్లిదండ్రులకు చేదోడుగా వచ్చి



రూపుదిద్దుకుంటున్న భారీ విగ్రహాలు

సహకరిస్తుంటారు. తమను ఎంతో కష్టపడి చదివిస్తున్న తమ తల్లిదండ్రులకు ఈ సమయంలో సహకరించడం ఆనందంగా ఉంటుందని అంటుంటారు.

ఈ ఏడాది భలే గిరాకీ

ఈ ఏడాది మట్టి విగ్రహాలకు మంచి గిరాకీ ఉందని గ్రామస్తులు అంటున్నారు. ముందుగానే అడ్వాన్స్‌లు ఇచ్చి విగ్రహాలను తమకు నచ్చినవిధంగా తయారు చేయించుకుంటున్నారు. చిన్న చిన్న గణపతులతో పాటు 15 నుంచి 20 అడుగుల గణపయ్యలను తాము రూపొందిస్తున్నామని చెబుతున్నారు. రెండు నెలలు కష్టపడితే వచ్చే ఆదాయంతో కష్టాలు తీరుతాయని చెబుతున్నారు. అందువల్ల ప్రతి ఏడాది తప్పనిసరిగా ఈ విగ్రహాల తయారీకి సంకల్పిస్తుంటామని చెబుతున్నారు. ఈ ఏడాది రూ.20 వేల వరకు తాము రూపొందించే విగ్రహాల ధరలు పలుకుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు పెద్ద విగ్రహాల కోసం ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వివిధ రూపాల్లో విఘ్నేశ్వరుడు

ఈ ఏడాది అమలాభట్టలో వివిధ రూపాలతో విఘ్నేశ్వరుడు రూపుదిద్దుకుంటున్నాడు. విగ్రహాలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం విగ్రహాల తయారీ తుది దశకు చేరుకుంది. రంగులను అద్దే పనిలో కళాకారులు నిమగ్నమయ్యారు. తమలపాకులో వినాయకుడు రూపం ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. అదేవిధంగా ఏనుగు వద్ద వినాయకుడు ఇలా ప్రతీ రూపంలో విగ్రహాలు అబ్బురపరుస్తున్నాయి.



రంగులు వేసే పనిలో మహిళ



చిన్న బొమ్మల తయారీలో కళాకారుడు



రంగులు అద్దే పనిలో నిమగ్నమైన కళాకారులు

శ్రమకు ఫలితం లభించడం లేదు



మట్టిని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నాం. సీజన్‌ వారీగా విగ్రహాలను రూపొందిస్తూ విక్రయాలు చేస్తున్నాం. రెండు నెలల ముందుగానే పనులు ప్రారంభించాం. అయితే ఈసారి విగ్రహాలకు మంచి గిరాకీ ఉన్నప్పటికీ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులు రూపొందిస్తున్న ప్లాస్టరాఫ్‌ పారిస్‌ విగ్రహాలకు సైతం డిమాండ్‌ ఉంది. ఎక్కువ మంది వాటినే కొనుగోలు చేస్తుండడంతో శ్రమకు తగిన ఫలితం లభించడం లేదు.

– పి.జయలక్ష్మి, అమలా భట్ట గ్రామం

షెడ్‌ నిర్మించాలి



గ్రామంలో దాదాపు వంద కుటుంబాలు మట్టినే నమ్ముకుని జీవిస్తున్నాం. ఇటువంటి సందర్భాల్లో విగ్రహాలను తయారీ చేసే ప్రక్రియలో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. విగ్రహాలను బయటే ఉంచాల్సిన పరిస్థితి వస్తోంది. వాటిని ప్లాస్టిక్‌ టార్పలిన్లతో కప్పుతున్నా ఒక్కొక్కసారి వర్షాలకు తడిచి పాడైపోతున్నాయి. దీంతో ఎంతో కష్టపడి తయారు చేసిన విగ్రహాలు నేలపాలవుతున్నాయి. అందువల్ల గ్రామంలో షెడ్‌ను ఏర్పాటు చేయాలని నాయకులు, అధికారులను చాలా రోజులుగా కోరుతున్నాం. అయినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా స్పందించి షెడ్‌ ఏర్పాటు చేయాలి.

– వి.భానుచందర్‌, అమలాభట్ట గ్రామం

తల్లిదండ్రులకు అండగా



స్థానిక ఇంజినీరింగ్‌ కళాశాలలో బీటెక్‌ రెండో ఏడాది చదువుతున్నాను. ప్రతీ ఏడాది వినాయక చవితి సమయంలో తల్లిదండ్రులకు అండగా ఉండేందుకు ఈ విగ్రహాల తయారీలో సహకరిస్తుంటాను. చిన్నతనం నుంచి విగ్రహాలు తయారు చేయడం ఎంతో ఇష్టం. ఆ అనుభవంతోనే విగ్రహాల తయారీకి సన్నద్ధమవుతుంటాను. ఈ ఏడాది ముందుగానే బుకింగ్‌లు వచ్చాయి. ఎంతో ఉత్సాహంగా ఉంది. వివిధ రకాల్లో ఈసారి విగ్రహాలను రూపొందిస్తున్నాం.

– రేఖాన శంకరరావు, అమలాభట్ట గ్రామం

ఇంటిల్లపాది కష్టపడుతుంటాం



ప్రతీ ఏడాది వినాయక చవితికి విగ్రహాల తయారీ కోసం ఇంటిల్లపాది కష్టపడుతుంటాం. ఈసారి ఆర్డర్లు బాగానే రావడంతో మంచి ఆదాయం వస్తుందని భావిస్తున్నాం. విగ్రహాలకు రంగులు అద్దే విషయంతో మేము సహకరిస్తుంటాం. ఏటా రూ.లక్షల్లో విక్రయాలు జరుగుతుంటాయి. ఆంధ్ర నుంచి కూడా ఇక్కడికి వచ్చి విగ్రహాలను ఖరీదు చేస్తుంటారు.

– ఆర్‌.రవణమ్మ, అమలాభట్ట గ్రామం

విద్యుత్‌ షాక్‌తో మహిళ మృతి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పోలీసుస్టేషన్‌ పరిధి లుగేల్‌ గ్రామంలో సోమవారం ఉదయం విద్యుత్‌ షాక్‌తో మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో నివాసముంటున్న సింగ సున, ఆయన భార్య అది సునలు రోజూ మాదిరిగానే వంటకు కర్రలు తీసుకొని వచ్చారు. వీరి ఇంటి ఇనుప రేకుల తలుపుకు కరెంట్‌ వైర్‌ తెగడంతో తగిలి ఉంది. విషయం తెలియక అది సున తలుపు తీయబోగా వెంటనే విద్యుత్‌ షాక్‌తో స్పృహ కోల్పోయింది. కొంత సమయానికి భర్త వచ్చి చూసేసరికి ఆమె కిందపడిపోయి ఉంది. అది గమనించిన భర్త ఇరుగుపొరుగు వారి సాయంతో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు స్పష్టం చేశారు. మోటు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



అది సున మృతదేహం

ఇద్దరు యువకులపై దాడి

జయపురం: ఇద్దరు యువకులపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరచిన ఘటన బొయిపరిగుడ సమితి గుంటగుడ జంక్షన్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. దశమంతపూర్‌ గ్రామానికి చెందిన సుభాష్‌ పంగి పనిమీద బోయిపరిగుడ వచ్చి మధ్యాహ్నం సమయంలో తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్‌ పోయించేందుకు ఒక బంక్‌ దగ్గర ఆగాడు. ఆ సమయంలో పెట్రోగుడ గ్రామానికి చెందిన ధర్మేంద్ర బారిక్‌ అక్కడికి వచ్చి సుభాష్‌ను అసభ్య పదజాలంతో తిట్టాడు. దీంతో సుభాష్‌ వెళ్లి ధర్మేంద్రను అడ్డుకోవడానికి ప్రయత్నించగా, అతడు గట్టిగా నెట్టివేయడంతో తన బైక్‌పై పడిపోయాడు. వెంటనే సుభాష్‌పై ధర్మేంద్ర దాడి చేయడంతో పాటు తన తమ్ముళ్లు జగదీష్‌ బారిక్‌, భరత్‌ బారిక్‌లకు ఫోన్‌చేసి పెట్రోలు బంక్‌ దగ్గరకు రమ్మని చెప్పారు. దీంతో బయపడిపోయిన సుభాష్‌ భయంతో పెట్రోలు బంక్‌ సమీపంలోని గుండగుడ జంక్షన్‌కు వెళ్లిపోయాడు. వెంటనే అక్కడికి బైక్‌పై వచ్చిన జగదీష్‌ బారిక్‌, భరత్‌ బారిక్‌లు సుభాష్‌పై గొడ్డలితో దాడి చేశారు. ప్రాణ భయంతో సుభాష్‌ ఒక ఇంటిలోనికి వెళ్లిపోయాడు. అది చూచిన ముగ్గురు అన్నదమ్ములు ఆ ఇంటిలో దూరి ఈడ్చుకుంటూ బయటకు వచ్చి ప్రాణాలు తీస్తామని హెచ్చరించారు. ఆ సమయంలో కుసపార గ్రామంలో ఉంటున్న సుభాష్‌ పిన్ని కుమారుడు విక్రాంత్‌ హరిజన్‌కు విషయం తెలిసి సంఘటన ప్రాంతానికి చేరుకుని కలుగజేసుకోగా అతడిపై సైతం దాడి చేశారు. తలపై గట్టిగా దెబ్బ తగలడం వలన అతడు కిందపడిపోయాడు. విక్రాంత్‌ మరణించాడని భావించి ముగ్గురు బైక్‌పై పారిపోయారు. తీవ్రంగా గాయపడిన విక్రాంత్‌ను బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో స్థానికులు చేర్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అతడిని కొరాపుట్‌ సహిద్‌ లక్ష్మణ నాయిక్‌ వైద్య కళాశాల మెడికల్‌కు తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



తీవ్రంగా గాయపడిన విక్రాంత్‌

ఉపాధ్యాయుల ఆందోళనకు నేతల మద్దతు



ఉపాధ్యాయులకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్‌ నేతలు

జయపురం: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరతూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఆందోళనలు చేపడుతున్న విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీల నేతలు జయపురం బ్లాక్‌ ఎడ్యుకేషన్‌ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులకు మద్దతు తెలుపుతున్నారు. జయపురం కాంగ్రెస్‌ ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహినీపతి, పట్టణ కాంగ్రెస్‌ అధ్యక్షుడు, జయపురం మున్సిపాలిటీ చైర్మన్‌ నరేంద్ర కుమార్‌ మహంతిలు తమ కార్యకర్తలతో వచ్చి ఉపాధ్యాయులకు మద్దతు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దుయ్యబట్టారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలని సూచించారు. సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం అధికార బీజేడీ నేత మాజీ మంత్రి రబినారాయణ నందో వచ్చి ఉపాధ్యాయులతో చర్చలు జరిపారు. ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేరుస్తుందని, ఆందోళన విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సంక్షేమం, ఉన్నతికి సీఎం నవీన్‌ పట్నాయక్‌ కృషి చేస్తున్నారన్నారు. అయితే రాష్ట్ర సంఘం నిర్ణయాన్ని తాము అమలు చేస్తామని, అందువలన అప్పటివరకు ఆందోళన కొనసాగిస్తామని ఉపాధ్యాయ నేతలు స్పష్టం చేశారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్‌ సైతం తమ కార్యకర్తలతో విచ్చేసి ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. ఆందోళనకు బీజేపీ తరుపున మద్దతు తెలిపారు.



ఉపాధ్యాయులతో చర్చిస్తున్న మాజీమంత్రి రబినారాయణ నందో

• ముగిసిన నాటకోత్సవాలు



కళాకారులను సత్కరిస్తున్న ఎంపీ చంద్ర శేఖర్‌ సాహు, ఎమ్మెల్యే విక్రమ్‌ పండా

స్థానిక హిల్‌పట్నా రోడ్‌లోని బిజూ పట్నాయక్‌ సాంస్కృతిక భవనంలో ఒడిశా నాటక సమరోహ సాహిత్య సమితి ఆధ్వర్యంలో 5 రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి నాటక మహోత్సవాలు సోమవారంతో అంగరంగా వైభవంగా ముగిశాయి. చివరిరోజు ముఖ్య అతిథులుగా బరంపురం ఎంపీ చంద్రశేఖర్‌ సాహు మరియు ఎమ్మెల్యే విక్రమ్‌ పండా హాజరై జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నగరంలో జాతీయ స్థాయి నాటక మహోత్సవాలు ప్రదర్శించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం స్థానిక కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్యదర్శి మిహర్‌ త్రిపాఠీ, రబి బెహరా, తిరుపతి నాయక్‌, కె.బలరామ్‌ సాహు, సత్యబ్రాత దాస్‌ తదితరులు పాల్గొన్నారు.

– బరంపురం



కళాకారుల కనకదుర్గా నృత్య ప్రదర్శన



ఆకట్టుకుంటున్న ఒడిస్సీ నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పట్నాయక్

రాయగడ: స్థానిక మజ్జిగౌరి కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు డాక్టర్ రమేష్ కుమార్ పట్నాయక్ రోగులను పరీక్షించారు. ఆపరేషన్ అవసరమయ్యే రోగులను విశాఖపట్నం పంపించి, తమ అసోసియేషన్ ద్వారా ఆపరేషన్లు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.పొలిరాజు, కార్యదర్శి బి.పైడిరాజులు తెలియజేశారు. ప్రతీ ఏడాది ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఏడాది మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్ ప్రారంభించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



జలాశయంలో రామ్‌చంద్ర మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ జలాశయంలో శనివారం సాయంత్రం పడవ బోల్తా పడి రామ్‌చంద్ర అనే వ్యక్తి గల్లంతైన విషయం తెలిసిందే. రెండు రోజులుగా మృతదేహం కోసం గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బందికి సోమవారం మధ్యాహ్నం మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. కేసు నమోదు చేశారు.

చీఫ్ సెక్రటరీకి డెంగీ



ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: రాష్ట్రంలో డెంగీ విజృంభిస్తోంది. ప్రధానంగా ఖుర్దా జిల్లాలో దీని ప్రభావం అత్యధికంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా సైతం డెంగీ బారినపడ్డారు. చికిత్స కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు క్యాపిటల్ ఆస్పత్రి అధికారవర్గాలు సోమవారం తెలిపాయి.

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని పట్టుకొని, ఎక్సైజ్ పోలీసులు సోదాలు నిర్వహించగా అతని వద్ద 20.340 కిలోల గంజాయి పట్టుబడింది. సోమవారం ఈ కేసుకు సంబంధించి వివరాలు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీమాకిరణ్ వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లా లాడపర్తి గ్రామానికి చెందిన సుశీల్ కుమార్ గౌతం (24)గా గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

టెక్కలిలో వరుస దొంగతనాలు

టెక్కలి: టెక్కలిలో ఇటీవల కాలంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. కొన్నాళ్ల కిందట శ్రీనివాసానగర్‌లో జరిగిన చోరీ మరచిపోక మునుపే తాజాగా ఆదివారం టెక్కలి ఆర్టీసీ డిపో ఎదురుగా ఓ ఇంటిలో బంగారం, నగదు చోరీ జరిగింది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా తినుబండారాల దుకాణం నిర్వహిస్తున్న విజయ్‌సాహు, డిపో ఎదురుగా నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి చేరుకోగా ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో భయాందోళన చెందాడు. ఇంటి మొత్తం పరిశీలించగా, ఇంట్లో ఉన్న అర తులం బంగారం ఉంగరంతో పాటు దాచుకున్న రూ.57 వేలు చోరీ జరిగినట్లు గుర్తించాడు. దీంతో టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కండక్టర్ నిజాయితీ

శ్రీకాకుళం అర్బన్: టెక్కలి డిపోకు చెందిన కండక్టర్ తన నిజాయితీని నిరూపించుకున్నారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం ప్రయాణిస్తున్న పాలఖండ్యాం గ్రామనికి చెందిన పల్లా మల్లేష్ అనే వ్యక్తి తాను ప్రయాణిస్తున్న బస్సులో విలువైన కార్డులతోపాటు రూ.3500 నగదు ఉన్న పర్సును జారవిడుచుకున్నారు. ఇంటికి వెళ్లిపోయాక పర్సు పోయిన ట్లు గుర్తించడంతో శ్రీకాకుళం బస్ స్టేషన్ మేనేజర్ నరేంద్రకు సమాచారం అందజేశారు. అదే విషయాన్ని ఆ బస్సు కండక్టర్ కేపీ రావును మేనేజర్ నరేంద్ర సంప్రదించగా తన వద్దనే పర్సు ఉందని కండక్టర్ తెలియజేసి, శ్రీకాకుళం వచ్చి ఆ ప్రయాణికుడికి పర్సును అందజేశారు.

● జట్నీలో 'హరిత పర్వతం'



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినుల బృందం



మొక్కలు నాటుతున్న చిన్నారులు



బచ్చర కొండపై మెగా ప్లాంటేషన్ చేపడుతున్న దృశ్యం

ఖుర్దా జిల్లా జట్నీ మున్సిపాలిటీ బచ్చర ప్రాంతం కొండపై హరిత పర్వతం ప్రాజెక్టుకు సోమవారం శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. బచ్చర కొండ పరిసరాలను నిత్య హరితంగా మలిచి పర్యావరణ పరిరక్షణ కాపాడడమే ఈ పథకం లక్ష్యమని మున్సిపల్ అధ్యక్షుడు అనంత బెహరా పేర్కొన్నారు. కొండ పరిసరాల్లో వివిధ రకాల 4 వేల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలు వర్గాలకు చెందిన 6 వేల మంది ప్రజలు పాలుపంచుకున్నారు. వీరిలో 2 వేల మంది పలు పాఠశాల విద్యార్థులు కావడం విశేషం. వీరంతా అత్యంత ఉత్సాహంతో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

-భువనేశ్వర్

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



విజేతలతో అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని బుటీగూడ పాఠశాలలో మన ఒడిశా ఆర్గనైజేషన్ తరుపున విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను జిల్లా అదనపు కలెక్టర్ వెద్బార్ ప్రధాన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. పోటీల్లో మొత్తం 765 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీలో స్థానిక ఐఎంఎస్టీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన సరస్మ మహరణ ప్రథమ స్థానంలో, మోడ్రన్ స్కూల్‌కు చెందిన తాపూర్ మల్లిక్ ద్వితీయ స్థానంలో, సాగర్ ముజుందర్ తృతీయ స్థానంలో నిలిచారు. వ్యాస రచనలో సరస్వతీ శిశుమందిర్‌కు చెందిన ప్రియాంక జన ప్రథమ స్థానం, జాస్మిన్ కోపే ద్వితీయ స్థానం, జగన్నాథ్‌పల్లి పాఠశాలకు చెందిన శాశ్వత్ పండ తృతీయ స్థానంలో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో శిశు మందిర్‌కు చెందిన శ్వేతపద్మ నాయిక్ ప్రథమ స్థానంలో, జగ్గన్నాథ్‌పల్లి పాఠశాలకు చెందిన బినిత్ బిల్వం ద్వితీయ స్థానంలో, శిశుమందిర్‌కు చెందిన లిప్సరాణి పండా తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ప్రకాష్ చంద్ర పట్నాయక్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి రవీంద్ర కుమార్ మహరణ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

● ఏడీఎం భాస్కర రైతా



మాట్లాడుతున్న ఏడీఎం భాస్కర రైతా, వేదికపై సవ్యసాచి, ప్రధాన్, పండ తదితరులు

రాయగడ: వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఎం భాస్కర రైతా అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి అప్రెంటిషిప్ మేళా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా పరిశ్రమలు కల్పించే ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంతకుమార్ ప్రధాన్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభకు అద్దంపట్టే ఇటువంటి మేళాలు బంగారు భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా పారిశ్రామిక కేంద్రం ఐపీవో సవ్యసాచి సాహు మాట్లాడుతూ వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రతీ మూడు నెలలకోసారి ఇటువంటి తరహా అప్రెంటిషిప్ మేళాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ అతూల్య కుమార్ పండా మాట్లాడుతూ ఐటీఐ చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని వెల్లడించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి తత్వమాసి మహాపాత్రో పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు విశేష స్పందన



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ లుహగుడి పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు విశేష స్పందన లభించింది. మొత్తంగా 130 వినతులు అందగా వాటిలో 8 వినతులను అక్కడికక్కడే అధికారులు పరిష్కరించారు. గ్రీవెన్స్ అనంతరం నాలుగు పంచాయతీల లబ్ధిదారులకు భూమి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, అదనపు ఎస్పీ సునీల్‌కుమార్ మహంతి, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్రమింజ్, ఐటీడీఏ పీవో ఫాల్గుణి, ఆర్.ఉదయగిరి పోలీసు అధికారి అశ్వినీ నాయక్, మోహనా సమితి అధ్యక్షుడు రాజీవ్ శోబోరో, సర్పంచ్ కైలాష్‌దళ బెహరా తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో అధికారులు

త్వరలో రెండో వందే ఎక్స్‌ప్రెస్ సేవలు



భువనేశ్వర్: రాష్ట్రంలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈనెల చివరి వారంలో ఈ రైలు నియమిత సేవలు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా పూరీ నుంచి తాల్చేరు రోడ్ రైల్వేస్టేషన్ల మధ్య రాను, పోను ట్రయల్ రన్ నిర్వహించారు. సెమీ-హై-స్పీడ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పూరీ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 9.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు తాల్చేర్ రోడ్ స్టేషను చేరింది. పూరీ నుంచి బయల్దేరిన ఈ రైలు ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, ఢెంకనాల్, తాల్చేరు రోడ్ రైల్వే స్టేషన్ల గుండా తాల్చేర్ రోడ్ గమ్యం చేరింది. పూరీ – రౌర్కెలా మధ్య సుమారు 505 కి.మీల దూరం ప్రయాణం నిడివి 7.30 గంటల నుంచి 7.45 గంటలు ఉంటుందని రైల్వే వర్గాల సమాచారం. భువనేశ్వర్ మినహా ఇతర స్టేషన్లలో ఈ రైలు 2 నిమిషాలు మాత్రమే ఆగుతుంది. భువనేశ్వర్ రైల్వే స్టేషనులో 5 నిమిషాల పాటు ఆగుతుంది.

రైలు వేళలు (రాకపోకల్లో)

పూరీ నుంచి	స్టేషన్	రౌర్కెలా నుంచి
ఉ.5.00 (ప్రారంభం)	పూరీ	రా.9.40 (గమ్యం)
ఉ.6.09	భువనేశ్వర్	రా.8.20
ఉ.6.36	కటక్	సా.7.44
ఉ.7.26	ఢెంకనాల్	సా.6.56
ఉ.8.36	అంగుల్	సా.6.16
ఉ.10.20	సంబలపూర్ సిటీ	సా.4.05
ఉ.11.25	ఝార్సుగుడ	మ.3.30
మ.12.45 (గమ్యం)	రౌర్కెలా	మ.2.10

స్పీకర్‌గా స్నేహాంగిని చురియా..?



స్నేహాంగిని చురియా

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ కొత్త స్పీకర్‌గా స్నేహాంగిని చురియా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఈ మేరకు ఊహాగానాలు బలం పుంజుకుంటున్నాయి. త్వరలో ప్రారంభం కానున్న వర్షాకాలం సమావేశాలు పురస్కరించుకుని స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. ఇటీవల జరిగిన మంత్రి మండలి విస్తరణ పురస్కరించుకుని స్పీకర్ పదవి ఖాళీ అయింది. డిప్యూటీ స్పీకర్ అదనంగా ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనెల 22 నుంచి శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమవ్వనున్నాయి. అంతకుముందు ఈనెల 21న స్పీకర్ అభ్యర్థి ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన నామినేషన్ పత్రాలు దాఖలకు గడువు ముగుస్తుంది. ఈసారి అటాబిర నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న షెడ్యూల్డు కులం మహిళగా స్నేహాంగిని ఛారియాను స్పీకర్‌గా చేయాలనే యోచన గింగుర్లు కొడుతుంది. మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నట్లు తరచూ ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్నేహాంగిని చురియాకు ప్రతిష్టాత్మక హోదా కల్పించనున్నట్లు లోపాయికారీ సమాచారం.

సార్వత్రిక ఎన్నికల ముందు

రాష్ట్రంలో ఎన్నికలు ఏ క్షణంలోనైనా జరగవచ్చనే చర్చ జోరుగా సాగుతోంది. దాదాపు ఈ నెలలో ప్రారంభం కానున్న వర్షాకాలం సమావేశాలతో ఈ విడత శాసన సభ ముగుస్తుందనే ఊహాగానాలు వ్యాప్తిలో ఉన్నాయి. 16వ శాసన సభ ముగిసే చివరి క్షణంలో రిజర్వుడు వర్గపు మహిళకు ప్రతిష్టాత్మక స్పీకర్ పదవిని ఇచ్చి మహిళా ఓటర్ల ఆదరాభిమానాలకు చేరువయ్యే వ్యూహంతో బీజేడీ శిబిరంలో చర్చ జరుగుతోంది. చురియా విద్యాధికృతతో సంఘ సేవకురాలిగా నియోజకవర్గంలో చక్కటి గుర్తింపు పొందిన మహిళ.

'డ్రైవింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకోండి'



డ్రైవింగ్ శిక్షణ అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేసిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్ శిక్షణ తీసుకున్న అభ్యర్థులు ఆ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ నందు శిక్షణ పూర్తి చేసుకున్న 13వ బ్యాచ్ విద్యార్థులకు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ చేతులమీదుగా సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకున్న డ్రైవర్లను ఆయన అభినందించారు. ఆర్టీసీలో డ్రైవింగ్ అంటే క్రమశిక్షణ, అంకితభావంతో శిక్షణ కూడుకున్నదని అన్నారు. ఇక్కడ నేర్చుకున్న శిక్షణ మీ జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం చూడకుండా, ఇంటివాళ్లపై ఆధారపడకుండా మీ కాళ్లపై మీరు నిలబడేలా ఉండాలన్నారు. ఆర్టీసీలో డ్రైవింగ్ పోస్టులకు నోటిఫికేషన్ పడే సందర్భంలో ఈ సర్టిఫికెట్‌కు ప్రథమ ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లు కె.మాధవ్, కెఆర్ఎస్ శర్మ, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ, ఏఎస్ఆర్ శ్రీనివాసు పాల్గొన్నారు. అనంతరం డ్రైవింగ్ శిక్షణ కోసం 14వ బ్యాచ్ ఈ వారంలో ప్రారంభమవుతుందని, వివరాలు కోసం 9963091999, 7382923293 నంబర్లను సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు కోరారు.

డిగ్రీ కాలేజీకి ఫిజిక్స్ కోర్సు మంజూరుపై హర్షం

కంచిలి: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్యావిధానం అనుసరించి ఫిజిక్స్ ఏకైక ప్రధాన సబ్జెక్టుగా కేటాయించడంపై ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఆధ్వర్యంలో ఈ కోర్సు మంజూరు చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణను కోరామని ఆమె తెలిపారు. వాస్తవానికి 2023-24 విద్యా సంవత్సరంలో ఈ డిగ్రీ కళాశాలలో కేవలం గణితం ప్రధాన సబ్జెక్టుగా ఒక కోర్సును మాత్రమే మంజూరు చేశారని, ఫిజిక్స్ సబ్జెక్టు కోర్సు కావాలని కోరడంతో వెంటనే స్పందించి, ఈ మేరకు మంజూరు చేయడం ఇక్కడ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

ఎయిడ్స్‌పై మరింత అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణలో భాగంగా ప్రజలకు, యువతకు మరింత అవగాహన పెంచేందుకు ఉద్దేశించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతకు అవగాహన పెంచేందుకు త్వరలో జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని డీఎంహెచ్ఓ బి.మీనాక్షి తెలిపారు. ఏపీఎస్ ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో 17-25 ఏళ్ల యువతకే 5కే రన్, క్విజ్, రీల్ మేకింగ్, డ్రామా మొదలైన విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇక్కడ గెలిచిన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. జేసీ ఎం.నవీన్, డీఆర్ఓ ఎం.గణపతి రావు వైద్యాధికారులు ఉన్నారు.

జిల్లాస్థాయి విభిన్నప్రతిభావంతుల క్రీడా పోటీలు వాయిదా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు వాయిదా పడ్డాయి. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు జరగాల్సిన జిల్లాస్థాయి క్రీడాపోటీలను ప్రతికూల వాతావరణం నేపథ్యంలో వాయిదా వేసినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. తదుపరి పోటీలు జరిగే తేదీని త్వరలో వెల్లడిస్తామని ఆయన చెప్పారు.

పీజీ ప్రవేశాలకు వేళాయె

- నేటి నుంచి పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్
- రాష్ట్రంలో 16 విశ్వవిద్యాలయాల పీజీ కోర్సుల్లో ప్రవేశాలు
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 కోర్సులు, 570 సీట్లు
- వర్సిటీ అఫిలియేషన్ కళాశాలల్లో 650 సీట్లు, మొత్తం 1220 సీట్లు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు సంబంధించిన ఆంధ్ర ప్రదేశ్ పోస్టు గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023 (ఏపీ పీజీసెట్-2023) కౌన్సెలింగ్ షెడ్యూల్ నోటిఫికేషన్‌ను ఏపీ ఉన్నత విద్యా మండలి సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం నుంచి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంతో పాటు, 16 విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది పీజీసెట్‌ను ఆంధ్రా విశ్వవిద్యాలయం నిర్వహించింది. ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజును విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. ఓసీ, బీసీలకు రూ. 700, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ విద్యార్థులకు రూ.500గా ఫీజు నిర్ణయించారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, కౌన్సెలింగ్ ఆప్షన్ల నమోదు వంటి ప్రక్రియలకు హెచ్‌టీటీపీఎస్:సీఈటీఎస్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ లోకి వెళ్లి హాల్ టికెట్, డేట్ ఆఫ్ బర్త్ ఆధారంగా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఫీజు డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చు. అనంతరం విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయవల్సి ఉంటుంది.

షెడ్యూల్...

వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్: ఈ నెల 12 నుంచి 20 వరకు కొనసాగుతుంది.

ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన: ఈ నెల 13 నుంచి 22 వరకు కొనసాగుతుంది.

ప్రత్యేక కేటగిరీలకు సంబంధించి విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజీలో ధ్రువీకరణ పత్రాలు నేరుగా పరిశీలిస్తారు. పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్సు విద్యార్థులు షెడ్యూల్ మేరకు ఫీజు చెల్లించి హాజరు కావాల్సి ఉంటుంది.

వెబ్ ఆప్షన్ల నమోదు: ఈ నెల 20 నుంచి 24 వరకు

వెబ్ ఆప్షన్ల మార్పు: 25వ తేదీన

సీట్ల అలాట్‌మెంట్: 27న సాయంత్రం ఆరు గంటలకు

క్లాస్ వర్క్ : ఈ నెల 29వ తేదీన

అవసరమైన ధ్రువీకరణ పత్రాలు

హాల్ టిక్కెట్, ర్యాంకు కార్డు, బదిలీ ధ్రువీకరణ పత్రం, డిగ్రీ మార్కుల మెమో, డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, టెన్త్, ఇంటర్, డిప్లమా, స్టడీ, రెసిడెన్స్, ఆదాయ, కుల, ఎకనామికల్లీ వీకర్ సెక్షన్, లోకల్ స్టేటస్ వంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం మేరకు అప్‌లోడ్ చేయాలి.

వర్సిటీలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 కోర్సులు, 570 సీట్లు ఉన్నాయి. ఎకనామిక్స్‌లో 40, రూరల్ డెవలప్‌మెంట్‌లో 40, ఎంకాంలో 40, ఎంఎల్ఐఎస్సీలో 40, ఇంగ్లిష్‌లో 40, ఎంఈడీలో 40, సోషల్ వర్క్‌లో 40, తెలుగులో 40, ఎంజేఎంసీలో 30, మ్యాథ్స్‌లో 44, అప్లైడ్ మ్యాథ్స్‌లో 22, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 33, ఎనలాటికల్ కెమిస్ట్రీలో 22, బయోటెక్నాలజీలో 33, మైక్రో బయోలజీలో 22, ఫిజిక్స్‌లో 44 సీట్లు ఉన్నాయి. అఫిలియేషన్ కాలేజీలైన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల, గురజాడ, ఎస్ఎస్ఆర్, ఆదిత్య, రంగముద్రి కళాశాలల్లో 650 సీట్లు ఉన్నాయి. కెమిస్ట్రీ, ఫిజిక్స్, తెలుగు, జువాలజీ వంటి కోర్సులు ఉన్నాయి.

ప్రమాణాలతో కూడిన విద్య



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సులు నిర్వహిస్తున్నాం. అఫిలియేషన్ కళాశాలల్లో సైతం విద్యార్థులు చేరవచ్చు. వర్సిటీలో ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాం. అర్హత ఉన్న వారికి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వర్తిస్తాయి. కౌన్సెలింగ్ షెడ్యూల్ మేరకు ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. విద్యార్థులు అందుబాటులో ఉన్న పీజీ విద్యను సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

క్లుప్తంగా

పీసా చట్టం అమలు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

పార్వతీపురం: గిరిజనుల హక్కులకు రక్షణ కల్పించే పీసా చట్టాన్ని అమలుచేయాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు బిడ్డిక రామారావు, దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ తదితరులు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో రహదారికి ఇరువైపులా ఉన్న స్థలాలను గిరిజనేతరులు అక్రమించినట్లు ఆరోపించారు. ఇంతవరకు గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలలో 517 అక్రమ నిర్మాణాలు జరిగాయన్నారు. 1/70 యాక్ట్ పీసా చట్టం అమలు చేసి గిరిజనేతరులు అక్రమించుకున్న షాపులను గిరిజనేతరులనుంచి స్వాధీనం చేసుకుని గిరిజనులకు అప్పగించాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



కేజీహెచ్‌లో కంబాల లక్ష్మి(49)మృతదేహం

భామిని: రోడ్డుప్రమాదంలో గాయపడిన మండలంలోని కోసలి గ్రామానికి చెందిన కంబాల లక్ష్మి(49) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల6వ తేదీన ఆమె సోదరుడి బైక్‌పై కొత్తూరు వెళ్తుండగా కర్లెమ్మ సమీపంలో జారిపడి తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంపై కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా వైద్యసేవలు పొందుతూ మరణించింది. మృతురాలి సోదరుడు కంబాల షణ్ముఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కొత్తూరు పోలీసులు విశాఖ కేజీహెచ్‌కు వెళ్లారు.


లారీని ఢీకొన్న బైక్: ఇద్దరికి గాయాలు

మెంటాడ(గజపతినగరం రూరల్): మండల కేంద్రంలోని నటరాజ్ దాబా సమీపంలో ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొనడంతో సోమవారం ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై గజపతినగరం ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి విజయనగరం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు నటరాజ్ దాబా వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని ఢీకొట్టి కిందపడి గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని 108లో సమీప ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

టీచర్ ఇంట్లో దొంగతనం

బొబ్బిలి: పట్టణంలోని రెల్లివీధిలో నివసిస్తున్న ఉపాధ్యాయిని పర్తాపు స్రవంతి ఇంట్లో శుక్రవారం రాత్రి దొంగలు పడి 43 తులాల బంగారం, రూ.13.50లక్షల నగదుదోచుకున్నారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. భార్యాభర్తలిద్దరూ శుక్రవారం ఊరెళ్లారు. ఊరి నుంచి శనివారం వచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సీఐ ఎం.నాగేశ్వర రావును వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


పాముకాటుకు గురై కౌలురైతు మృతి



ప్రభాకరరావు మృతదేహం

రేగిడి: మండల పరిధిలోని పెద్ద శిర్లాం గ్రామానికి చెందిన కౌలు రైతు కురిటి ప్రభాకర రావు (50) సోమవారం పాముకాటుకు గురై మృతిచెందాడు. తాను కౌలు చేస్తున్న పొలంలో వరిపంటకు నీరుపెడుతున్న సమయంలో పాము కాటు వేసింది. వెంటనే పక్కనే ఉన్న రైతులు గమనించి ప్రభాకరరావును హుటాహుటిన ఇంటికి తీసుకువెళ్లారు. ఆస్పత్రికి తరలించే సమయంలో మృతిచెందాడు. మృతునికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు సాయిసంతోష్, సోమశేఖర్‌లు ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతురాలికి ఉద్యోగపత్రం



నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భాగంగా బొబ్బిలికి చెందిన బొత్స వీరమాత అనే విభిన్న ప్రతిభావంతురాలికి బీసీ సంక్షేమశాఖలో ఆఫీస్ సబార్డినేట్ పోస్టులో నియమిస్తూ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి నియామక పత్రాన్ని అందజేశారు. 2017-18 లో వెలువడిన నోటిఫికేషన్ అనుసరించి ఆమెను జేసీ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ కమిటీ ఎంపిక చేసింది.

వ్యవధిలోగా వినతుల పరిష్కారం

- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖలకు వచ్చిన వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం ఆమె జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి 152 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. వినతులు స్వీకరించినప్పటి నుంచి కింది స్థాయి సిబ్బంది ఆయా వినతులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు? అర్జీదారుల కోరిన విధంగా పరిష్కారం అవుతున్నదీ లేనిదీ పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండల ప్రత్యేకాధికారులు వారి పరిధిలో వచ్చిన వినతుల పరిష్కారంపై నివేదికలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మంగళవారం ఒక్కో శాఖకు సంబంధించిన కేసులను సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వశాఖల కేసులకు సంబంధించి జిల్లా స్థాయి నోడల్ అధికారిగా మైనారిటీ సంక్షేమ అధికారి లావణ్యను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలత, సూర్యనారాయణ, సుదర్శన దొర పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జేసీ మయూర్ అశోక్

తక్షణమే ఫిర్యాదులపై స్పందన

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని జిల్లా పోలీసు అధికారులకు అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి 16 ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, బాధితులకు న్యాయమందించాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఎస్సై ప్రభావతి, పోలీసుఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితుల ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ ఫర్హీన్

సత్వరమే అర్జీదారులకు న్యాయం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం:

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులకు సత్వరమే నాణ్యమైన పరిష్కారం చూపి అర్జీదారులకు న్యాయం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని 66 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను శాఖల వారీగా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావులు అర్జీలు స్వీకరించారు.

ట్రైసైకిల్స్ సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న మూడు చక్రాల సైకిల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్‌లో బలిజిపేట మండల కేంద్రానికి చెందిన బొత్స లలితకు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. ఆమె జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నడవడానికి వీల్‌చైర్ కావాలని అభ్యర్థిచడంతో కలెక్టర్ తక్షణం స్పందించి మూడు చక్రాల సైకిల్‌ను మంజూరుచేశారు. ఈ మేరకు మూడు చక్రాల సైకిల్‌ను బాధితురాలికి జేసీ అందజేయగా ఆమె హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో డీఆర్ఓ జె.వెంకటరావు, జిల్లా ప్రతిభావంతులు, వయోవృద్ధుల అధికారి పీవీ.రమణమూర్తి తదితరులున్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్



మూడు చక్రాల సైకిల్‌ను అందజేస్తున్న జేసీ గోవిందరావు

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ హర్షిత, ఎస్బీ సీఐ, సీహెచ్. లక్ష్మణ రావు, డీసీఆర్‌బీ సీఐ ఎస్.వి.ప్రభాకర్ రావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలనలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: పరిపాలనలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు ఆరు రోజుల రిఫ్రెషర్ రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిపాలన సంబంధమైన విషయాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకువెళ్లాల్సింది పంచాయతీ కార్యదర్శులేనని అభిప్రాయ పడ్డారు. గ్రామాల్లో అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజలతో మమేకం కావాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదని, వచ్చిన అవకాశాన్ని పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజల మెప్పు పొందేందుకు కృషి చేయాలి

కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాన్ని, పనితీరును మెరుగుపరుచుకోవడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారు. విభిన్నమైన ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులతో పరస్పరం తమ అనుభవాలను పంచుకుంటే మరిన్ని అంశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్ శిక్షణ కార్యక్రమం అంశాలను వివరించారు. స్వమిత్వ, ఎన్ఆర్ఈజీఎస్ పథకం, లేఅవుట్లు, ఎస్డీజీ అంశాలపై శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. అనంతరం శిక్షణకు సంబంధించి పుస్తకాలను జెడ్పీ చైర్మన్ పంచాయతీ కార్యదర్శులకు అందించారు. కార్యక్రమంలో డీపీవో శ్రీధర్‌రాజా, జెడ్పీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పుస్తకాలను కార్యదర్శులకు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

స్టార్టప్ సమస్యల పరిష్కారంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి

విజయనగరం అర్బన్: స్టార్టప్ సంస్థల నిర్వహణలో యువమేధస్సు ప్రతిభ చూపడంతోపాటు వాటి నిర్వణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై సాంకేతికతను వినియోగించుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి సూచించారు. స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వర్సిటీలో 'వ్యవస్థాగత, నాయకత్వ అభివృద్ధి' అనే అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టార్టప్‌లను ప్రోత్సహించడంతోపాటు వాటి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై సమాంతరంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఔత్సాహికులైన విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలనుకునే వారు ముందుగా ఈఎల్‌డీపీలో నమోదు చేసుకోవాలని చెప్పారు. నమోదైన విద్యార్థులందరినీ 100 మంది చొప్పున ఒక బ్యాచ్‌గా విడదీసి ఈ బ్యాచ్‌లను మళ్లీ గ్రూపులుగా విడదీసి, ప్రతి గ్రూప్‌లో 4 నుంచి 5 మంది విద్యార్థులు సభ్యులుగా ఉండే విధంగా తయారు చేసి ఐఐటీ పాట్నా, ఐఐఎం కోల్‌కత్తా నుంచి నిష్ణాతులైన నిపుణులు గ్రూపులకు మెంటర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, అధ్యాపక సిబ్బందితోపాటు విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యున్నతికి కృషిచేయాలి

విజయనగరం టౌన్: భారతీయ జనతా పార్టీ అభ్యున్నతికి కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథరాజు పేర్కొన్నారు. స్థానిక రింగురోడ్డులో ఉన్న కార్యాలయంలో సోమవారం బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నడుకుదిటి ఈశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడి ఎంపిక శుభదాయకమన్నారు. ముందుండి జిల్లాను నడిపించాలని, అందుకు పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా కృషిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరరావు మాట్లాడుతూ అందరి సమష్టికృషితో పార్టీని అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు కృషిచేస్తానని, అంత్యోదయ సూత్రంతో పనిచేస్తానని చెప్పారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా ఇన్‌చార్జ్ వీవీ.రామరాజు, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాగానే స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపికలు

- స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్‌వి రమణ

విజయనగరం: పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్వహించే స్కూల్‌గేమ్స్ అండర్-14,17 బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఆసక్తి గల క్రీడాంశాల్లో పాల్గొనవచ్చని సూచించారు. ఇందులో భాగంగా ఈనెల 20వ తేదీలోగా అండర్-17 విభాగంలో హ్యాండ్‌బాల్, వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అండర్-14,17 విభాగాల్లో రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మిగిలిన క్రీడాంశాలకు సంబంధించి ఎంపిక పోటీల తేదీలను త్వరలోనే తెలియజేస్తామని, వ్యాయామ ఉపాధ్యాయులు ఆసక్తి గల క్రీడాకారులను సిద్ధం చేసుకోవాలని సూచించారు.



స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ

నాగావళిలో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

వీరఘట్టం: కాలువ గట్టులో స్నానం చేసి కొద్దిసేపటిలో వచ్చేస్తానని ఇంట్లో చెప్పిన వెళ్లి వ్యక్తి విగత జీవిగా మారాడు. వీరఘట్టం మండలం ఎం.రాజపురం జంక్షన్ వద్ద సోమవారం ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం పంచాయతీలోని పెరుగువీధికి చెందిన వెన్నెల రాంబాబు(38) గ్యాస్ వెల్డింగ్ పనులు చేస్తూ తన తల్లితో పాటు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. రాంబాబు కొన్నేళ్లుగా మూర్ఛ రోగంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం కుటుంబంలో అందరికీ తెలుసు. ఫిట్స్ వచ్చేటప్పుడు చేతిలో ఇనుప తాళాలు పెడితే సాధారణ పరిస్థితికి వచ్చేవాడు. ఎప్పుడూ ఇంటి వద్దే స్నానం చేస్తుండేవాడు. అయితే సోమవారం ఎం.రాజపురం జంక్షన్ వద్ద ఉన్న తోటపల్లి ఎడమకాలువ పరిధిలో నాగావళి 6వ బ్రాంచ్ కాలువ వద్దకు ఉదయం 7 గంటలకు ఒంటరిగా వెళ్లాడు. ఉదయం 10 గంటలవుతున్నా భర్త ఎంతకీ రాకపోవడంతో కుటుంబసభ్యులను కాలువ గట్టు వద్దకు భార్య లక్ష్మి పంపించింది. అయితే కాలువ గట్టు సమీపంలో వెల్‌సైఫన్‌లో రాంబాబు అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించి బయటకు తీశారు. అప్పటికే రాంబాబు మరణించాడు. కాలువ గట్టు వద్ద స్నానం చేస్తుండగా ఫిట్స్ రావడంతో కాలువ గుండా కొట్టుకుపోయి సమీపంలో ఉన్న వెల్ సైఫన్ లోకి కొట్టుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సమాచారంతో ఎస్సై ఎం.వి.రమణ సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



రాంబాబు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుమార్తె

డోలీలో మూడు కిలోమీటర్ల ప్రయాణం

పాచిపెంట: మండలంలోని మూటకూడు గ్రామానికి చెందిన సేబినరసయ్య సోమవారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో గ్రామానికి రహదారి సౌకర్యం లేక డోలీ కట్టి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గల్లపాడు గ్రామానికి తీసుకువచ్చారు. అక్కడినుంచి ఆటోలో సాలూరు సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



నరసయ్యను డోలీలో తరలిస్తున్న గ్రామస్తులు

ప్రాథమిక విద్య మరింత పటిష్టం

శ్రద్ధగా వినడం.. చక్కగా చదవడం.. అందంగా రాయడం.. సరళంగా మాట్లాడడం.. ప్రాథమిక భావనలను అర్థంచేసుకోవడం.. వంటి విద్యాభ్యసన, భాషా సామర్థ్యాలను చిన్నారుల్లో పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యాప్రణాళికలు అమలుచేస్తోంది. చిన్నవయసులోనే విద్యార్థుల చదువులకు గట్టిపునాది వేసేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎఫ్ఎల్ఎన్‌కు శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యను మరింత పటిష్టవంతం చేసేలా టీచర్లకు శిక్షణ ఇస్తోంది. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది.

- పూర్వ ప్రాథమిక, 1, 2 తరగతుల పిల్లలకు ఎఫ్ఎల్ఎన్
- 'ప్రథమ్' భాగస్వామ్యంతో కార్యక్రమం అమలుకు శ్రీకారం
- అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేలా ప్రణాళిక
- మండలానికి ముగ్గురు వంతున 81 మంది టీచర్లను డీఆర్‌పీలుగా ఎంపిక
- డీఆర్‌పీలకు శిక్షణ పూర్తి: డీఈఓ



డీఆర్‌పీల శిక్షణలో బోధన సామర్థ్యాలను మెరుగుపరిచే ప్రదర్శనలు

విజయనగరం అర్బన్: విద్యార్థుల చదువులే రాష్ట్రానికి పెట్టుబడి అన్న ప్రధాన ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం విద్యాసంస్కరణలు అమలుచేస్తోంది. ఆర్థిక సమస్యలతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరంకారాదన్న లక్ష్యంతో సంక్షేమ పథకాలు అమలుచేస్తోంది. నాడు-నేడుతో సర్కారు బడులను సుందరంగా తీర్చిదిద్దుతోంది. సకల సదుపాయాలు కల్పిస్తోంది. తాజాగా.. ప్రాథమిక విద్యను మరింత పటిష్టవంతం చేసే చర్యలు చేపట్టింది. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాల స్థాయి చిన్నారుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేందుకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని రూపొందించింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) అమలు నేపథ్యంలో ఎన్జీఓ సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. దీనికోసం ముందస్తుగా రాష్ట్ర, జిల్లా స్థాయి శిక్షణకు ఆసక్తిగల ఉపాధ్యాయులను ఎంపిక చేసిన శిక్షణ ఇస్తోంది. అక్కడ శిక్షణ పొందిన వారితో మండల స్థాయిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది.

మండలానికి ముగ్గురు టీచర్ల ఎంపిక

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం క్షేత్రస్థాయి సెకండరీ గ్రేడ్ టీచర్లతో అమలుచేసేందుకు రాష్ట్రస్థాయి శిక్షకులతో తొలిదశగా జిల్లాస్థాయి శిక్షకుల (డీఆర్‌పీలు)కు రాష్ట్రంలో ఆరు కేంద్రాలలో ఆరు రోజులపాటు శిక్షణ ఇచ్చింది. విజయనగరం జిల్లా నుంచి మండలానికి ముగ్గురు చొప్పున 81 మంది ఎస్జీటీలు శిక్షణ పొందారు. వీరంతా త్వరలో మండలాలకు వెళ్లి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ ఉద్దేశాలను బోధిస్తారు.

జ్ఞాన జ్యోతి, జ్ఞాన ప్రకాష్‌గా విభజన

ఎఫ్ఎల్ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞానజ్యోతిగా, ప్రాథమిక విద్య (తరగతి-1, 2) జ్ఞానప్రకాష్‌గా విభజించారు. జ్ఞాన జ్యోతి విభాగంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయలకు 120 రోజులు, జ్ఞాన ప్రకాష్ విభాగంలోని ఎస్జీటీలకు 60 రోజుల శిక్షణ ఉంటుంది. ఏడాదికి 20 రోజుల వంతున మూడేళ్లపాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. 20 రోజులలో తొలి ఆరు రోజులు ఆఫ్‌లైన్‌లో, మిగిలిన 14 రోజులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం ప్రాథమిక విద్యకు సంబంధించిన జ్ఞాన ప్రకాష్ బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్‌పీలకు తర్ఫీదు ఇస్తున్నారు.

నూతన విద్యావిధానంలో భాగంగా....

నూతన విద్యావిధానం 2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను ప్రవేశ పెట్టారు. ఇందులో ప్రీ ప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ-1లో 3 - 4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ-2లో 4-5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్ల నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026-27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలు కచ్చితంగా కలిగి ఉండాలి.

ఎఫ్ఎల్ఎన్ అమలు ఎందుకు?

పదోతరగతికి చేరుకుంటున్న కొందరు విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు లోపిస్తున్నాయని, తెలుగు, గణితం వంటి సబ్జెక్టుల్లో ప్రాథమిక భావనలపై కూడా అవగాహన ఉండడంలేదన్న కఠోర వాస్తవాలను అసర్, నాస్, శ్లాస్ తదితర నివేదికలు బహిర్గతం చేశాయి. దీంతో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థి 1, 2 తరగతులు పూర్తి చేసి మూడో తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవడం, చక్కగా రాయడం, శ్రద్ధగా వినడం, మాట్లాడడం వంటి అభ్యసన, భాషా సామర్థ్యాలను పెంపొందిస్తారు. గణితంలో చదుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై ప్రతి విద్యార్థి నైపుణ్యం సాధించేలా తీర్చిదిద్దుతారు.

డీఆర్‌పీలకు శిక్షణ పూర్తి

ప్రాథమిక విద్యలోనే విద్యార్థి అభ్యసన, భాష సామర్థ్యాలను మెరుగుపరిచే నూతన బోధన నైపుణ్యాలను ఉపాధ్యాయులకు అందించే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తోంది. దీని కోసం మండలానికి ముగ్గురు వంతున ఉపాధ్యాయులను ఎంపిక చేసి డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్ (డీఆర్‌పీ)లుగా వారికి ఇటీవల శిక్షణ ఇచ్చాం. త్వరలో వీరంతా మండలాలకు వెళ్లి ఎస్జీటీలకు ఆరురోజు ఆఫ్‌లైన్‌లో, 14 రోజులు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఈ శిక్షణ దోహదపడుతుంది.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ